ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

■ అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
■ ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 15: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి సామాన్యుల సమస్యలు పరిష్కరించుకునేందుకు చక్కని వేదిక అన్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత, డబుల్‌బెడ్ రూమ్ , ఆసరా పింఛన్లకు సంబంధించి 66 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కొమ్మూరి' భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలి

సిద్దిపేట, జూలై 15 : చేర్యాలలో కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భూదాన్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకుని అనుభవిస్తున్నాడని.. ఆ భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, సీపీఎం నాయకులు బోయిని మల్లేశం,ఆముదాల రంజిత్‌రెడ్డి, కొండం సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 15: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న నేపధ్యంలో కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం ధర్నా చేపట్టారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, పెన్షనర్ల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పెన్షనర్ల జేఏసీ జిల్లా కో ఆర్డినేటర్ భిక్షపతి, జిల్లా పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

రామకోటి రామరాజుకు సన్మానం

రామకోటి రామరాజును సన్మానిస్తున్న శ్రీరామ భక్తబృందం సభ్యులు

సిద్దిపేట, జూలై 15 : గజ్వేల్‌లోని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు భక్తిరత్న జాతీయ పురస్కారం వచ్చిన సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం రామభక్త బృందం ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామ బృందం ప్రతినిధులు తంగళ్లపల్లి నరేశ్, అయిత శ్రీకాంత్, బొల్గం శ్రీనుగౌడ్, జపా మధుసూదన్‌రెడ్డి, మామిడాల సురేశ్, నాగేందర్, వేణు, చిరంజీవి, అర్చకులు మల్లిపెద్ది నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ చేయూత

మిరుదొడ్డిలో మృతుడి కుటుంబ సభ్యులకు చేయూత అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, జూలై 15 : ఇటీవల మిరుదొడ్డి టౌన్‌లో ధర్మారం కనుకయ్య, అందె గ్రామంలో సూకురి బాల్‌నర్సవ్వ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, అందె మాజీ ఎంపీటీసీ జక్కిరెడ్డి సోమేశ్వర్‌రెడ్డి సోమవారం మృతుల కుటుంబాలకు ఆర్థికసాయంతో పాటు బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలి

మిరుదొడ్డి: అల్వాల నుంచి సిద్దిపేటకు పాదయాత్ర చేస్తున్న జేఏసీ నాయకులు

మిరుదొడ్డి, జూలై 15 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. గుంతలమయమైన మట్టి రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల నుంచి జేఏసీ ఆధ్వర్యంలో చలో సిద్దిపేట వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. గుడికందుల నుంచి అల్వాల వరకు బీటీ రోడ్డు వేయాలన్నారు. కార్యక్రమంలో అల్వాల గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

ముత్తన్నపేటలో వాటర్‌ట్యాంకు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, జూలై 15: నిరుపేదలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. అనంతరం మోడల్ స్కూల్ వంటి గదిని ప్రారంభించి, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ముత్తన్నపేటలో వాటర్‌ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో కాలేజీరోడ్డు వద్ద నిలిచిన మురుగు నీటి ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మల్లేశం, ఎంపీడీవో లక్ష్మప్ప, ప్రిన్సిపాల్ హర్జీత్‌కౌర్, ఏఈ సమ్మయ్య, ప్రత్యేక అధికారి రేణు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడికి పరామర్శ

కల్లెపల్లిలో మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, జూలై 15: మండలంలోని కల్లెపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్ తండ్రి బుర్ర మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కచ్చు రాజయ్య, రామాలింగారెడ్డి, రాజయ్య, తిరుపతి, సుదర్శన్, నాగభూషణం ఉన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు సన్మానం

నంగునూరు, జూలై 15: మండలంలోని నర్మెట్ట ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివి 10 జీపీఏ సాధించడంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 34 మంది విద్యార్థులను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగానే రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట నియోజకవర్గం టెన్త్ ఫలితాల్లో మొదటి స్థానం రావడంతో పాటు అత్యధిక ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాగుల సారయ్య, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గోవిందారం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్, నాయకులు నారాయణ, రాము, సిద్దు, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సంగుపల్లిలో మురుగుకాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జూలై 15: మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆరో వార్డులోని సంగుపల్లిలో పర్యటించిన సందర్భంగా మురుగు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని కౌన్సిలర్ రజిత మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్య దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు చైర్మన్ సూచించారు. డంపింగ్ యార్డులో నాటే మొక్కలను కాపాడుకునే బాధ్యత మనదే అని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ జరుగుతున్న లెగి సి వేస్ట్ పనులు, తడిపొడి చెత్తను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావొద్దు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్

బెజ్జంకి, జూలై 15: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్సై శంకర్‌రావు అన్నారు. మండలంలోని దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం మహిళా రక్షణ చట్టాలు, చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయురాలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన విద్యార్థులు

సిద్దిపేట కమాన్, జూలై 15 : జిల్లా విద్యార్థులు తైక్వాండోలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారని తైక్వాండో జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన సిద్దిపేటలో మాట్లాడుతూ.. ఇటీవల రామచంద్రాపురం బాలాజీ గార్డెన్ బీహెచ్ఈఎల్‌లో జరిగిన 13వ ఉమ్మడి మెదక్ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థులు క్యాడెట్ విభాగంలో విజయ్ (గోల్డ్ మెడల్), జె. ప్రణవి, సీహెచ్ అమేశ్వర్ (సిల్వర్ మెడల్), డి.ఆహ్లాదిక. ఎం.బిందు, ఎం.పునీత్‌రెడ్డి (బ్రాంజ్ మెడల్), జూనియర్ విభాగంలో పృథ్వీరాజ్ (బ్రాంజ్ మెడల్) సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను తైక్వాండో జిల్లా గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణశర్మ, తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.రామ్మోహన్, డీవైఎస్‌వో నాగేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు పాల సాయిరామ్ అభినందించారు.

స్వాతి నక్షత్ర మహోత్సవం

పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

సిద్దిపేటరూరల్, జూలై 15 : మండలంలోని పుల్లూరు బండ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో సోమవారం స్వాతి నక్షత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారికి పంచ కలశ అభిషేకం నిర్వహించారు. మహోత్సవంలో ఆలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పొడిచేటి శ్రీనివాసాచారి, రామకృష్ణ, చైతన్య, పవన్‌కుమార్, సాయికృష్ణ, మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతిరెడ్డి, నాయకులు ప్రదీప్‌రావు, రామారావు, సుధాకర్, శ్రీనివాస్, దేశెట్టి తిరుపతి, ఒగ్గు మురళి, భక్తులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

సిద్దిపేట, జూలై 15: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ప్రకటించారు. సిద్దిపేట బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా కంకటి నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా తొగుట అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తొగుట అనిల్ కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా ఏనుగుల సాయికిరణ్, బీసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా భార్గవ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా వల్లపు పవన్,ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌గౌడ్,కార్యదర్శిగా తాళ్లపల్లి సురేశ్‌ను నియమించారు.

గురువన్నపేటకు ఆర్టీసీ బస్సు

గురువన్నపేటకు వచ్చిన సిద్దిపేట బస్సు

కొమురవెల్లి, జూలై 15 : కొమురవెల్లి మండలం గురువన్నపేటకు 30 ఏండ్ల నుంచి వచ్చిన సిద్దిపేట బస్సు కరోనా కాలంలో బంద్ అయింది. తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ బస్సు రాక ప్రయాణికులు, మల్లన్న భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కొమురవెల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వగా వెంటనే బస్సును యథావిధిగా నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. సోమవారం గురువన్నపేటకు సిద్దిపేట బస్సు వచ్చింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలి

కొమురవెల్లి, జూలై 15 : మండలంలోని ఐనాపూర్‌లో గ్రామ పంచాయతీ వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని సోమవారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్ కొన్ని నెలలుగా మూతపడిందన్నారు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కానుగుల రాజు, సున్నం యాదగిరి, ఎల్లయ్య, శంకర్, ప్రభాకర్, మహేశ్, శ్రీను పాల్గొన్నారు.

డంపు చేసిన ఇసుక సీజ్

వర్గల్, జూలై 15 : మండలంలోని వేలూర్ గ్రామం గురువన్నగుట్ట అటవీప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది ఇసుకను డంపుచేశారన్న నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ సిబ్బందితో కలిసి వెళ్లి సీజ్‌చేశారు. డంపుచేసిన ఇసుకను తహసీల్ కార్యాలయానికి తరలిస్తామని ఆర్ఐ చెప్పారు. ఇసుకను డంపు చేసినవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల్లో 'అమ్మమాట-బడిబాట'

బైరాన్‌పల్లి గ్రామంలో 'అమ్మమాట-బడిబాట'లో పాల్గొన్న అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 15 : మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాలతో పాటు బైరాన్‌పల్లి, గాగిళ్లాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం 'అమ్మమాట-బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రజియాబేగం, శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, యాకమ్మ, భాగ్యమ్మ, మౌనిక, గుడిసె అరుణజ్యోతి, దాసరి కళావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటితో చెరువులను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలి

కొమురవెల్లిలో తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, జూలై 15 : నీటితో చెరువులు, కుంటలను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్ కార్యాలయం వరకు సీపీఎం శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకునే అవకాశం ఉన్నా కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, బండకింది అరుణ్‌కుమార్, మండల నాయకులు తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, తడకపల్లి శ్రీనివాస్, బక్కెలి బాలకిషన్, దాసరి చక్రపాణి, ఆరుట్ల రవీందర్, సార్ల యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా కోటిపార్థివ లింగాల ప్రతిష్ఠాపన పూజలు

గోపూజలో పాల్గొన్న వేదపండితులు

దౌల్తాబాద్/రాయపోల్, జూలై 15: దౌల్తాబాద్ మండలం దొమ్మాట, గాజులపల్లి గ్రామాల మధ్యనున్న కైలాసపురంలో సోమవారం కోటిపార్థివ లింగాల మహాప్రతిష్ఠాపన మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచే స్థాపిత పూజోత్సవాలకు చాముండేశ్వరి గురుదత్త పీఠం ఆధ్వర్యంలో కొడకండ్ల రామ్‌చరణ్ శర్మ గురూజీ నేతృత్వంలో గణపతి పూజతో పాటు ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. తిరువన్నమలై అరుణాచలేశ్వర వేద పండిత బృందంతో మహా రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, గోపూజ, అరుణాచలం జ్యోతిప్రజ్వలన ఆవహిత పూజలు, పూర్ణాహుతి, ఇత్యాధి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, శైవ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అధికారుల అలసత్వం

■ సమయపాలన పాటించని నంగునూరు ఎంపీడీవో కార్యాలయం అధికారులు
■ గంటల తరబడి వేచి ఉన్న ప్రజలు

సోమవారం ఉదయం 11 గంటలు దాటుతున్నా మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

నంగునూరు, జూలై 15 : నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సమయానికి కార్యాలయానికి రాకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం ఉదయం 11 గంటలు దాటుతున్నా కార్యాలయానికి ఏ ఒక్క అధికారి రాలేదు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు చాలాసేపు నిరీక్షణ తప్పలేదు. సమయానికి రావాల్సిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇలా ఆలస్యంగా రావడంపై సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

మిట్టపల్లి పంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న భూ బాధితులు

రోడ్డు వెడల్పును తగ్గించాలి

సిద్దిపేట అర్బన్, జూలై 15 : మండలంలోని మిట్టపల్లి మీదుగా నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 765డీజీ రోడ్డు నిర్మాణ పనులను పాత మార్కింగ్ ప్రకారం 100 ఫీట్ల వెడల్పులోనే చేయాలని గ్రామంలోని భూ బాధితులు తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం గ్రామపంచాయతీ వద్ద జరిగిన గ్రామసభలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూ బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో రోడ్డు వెడల్పు 100 ఫీట్లు ఉంటుందని మార్కింగ్ చేసిన అధికారులు, ఇప్పుడు 150 ఫీట్ల వెడల్పు ఉంటుందని మార్కింగ్ మారుస్తున్నారని వాపోయారు. గతంలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారమే తాము ఇండ్ల నిర్మాణం చేసుకోవడంతో పాటు కొంతమంది ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేశారని.. 150 ఫీట్లతో నిర్మాణం చేపడితే తాము పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా 300 మీటర్ల వరకే కుదించాలని డిమాండ్ చేశారు. గతంలో రైల్వే లైన్ నిర్మాణం కోసం భూములు పోగొట్టుకొని అందులో వచ్చిన డబ్బులతో రోడ్డు పక్కన ప్లాట్లు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు మళ్లీ రోడ్డు వెడల్పులో పోతుంటే తాము ఏంచేయాలని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం పై సంబంధిత అధికారులు భూములు కోల్పోతున్న రైతులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో భూ బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

సిద్దిపేట టౌన్, జూలై 15 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకు పొడిగించామని ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కవిత సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ స్టడీ సర్కిల్ రెసిడెన్షియల్స్‌తో కూడిన ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు రూ.3లక్షలలోపు ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయిస్తామన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్, జూలై 15 : మాదిగలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై మరో పోరాటానికి యాదగిరిగుట్ట వేదికగా ఈనెల 19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు తలపెట్టిందని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ స్పష్టం చేశారు. సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆయన సిద్దిపేటలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్రం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

26న చలో హైదరాబాద్

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 15 : ఈ నెల 26న చేపట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య కోరారు. సోమవారం మండలంలోని దుద్దెడ బస్టాండ్ ఆవరణలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు చెల్లించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి అందరికీ సమాన వేతనాలు ఇచ్చి గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్ జూలై 15: లారీలో అక్రమంగా తరలిస్తున్న 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బుద్ద రాములు, గుర్రం రాములు కలిసి లారీలో ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని జగదేవ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు.

సూక్ష్మరాతి పనిముట్లు లభ్యం

నంగునూరు, జూలై 15 : మండలం కేంద్రంలో గ్రామానికి చెందిన ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ సూక్ష్మరాతి పనిముట్లను గుర్తించాడు. కొన్నేండ్లుగా గ్రామంలో పరిశోధనలు చేస్తున్న ఆయన కొత్తరాతి యుగం నాటి రాతి గొడ్డళ్లు, శాతవాహనుల కాలం నాటి టెర్రకోట బొమ్మలు, పూసలు, దేవత విగ్రహాలను గుర్తించాడు. పరిశోధనలో భాగంగా సోమవారం గ్రామానికి దక్షిణం వైపున ఉన్న జోకిరమ్మ బండ మీద సూక్ష్మరాతి పరికరాలు (మైక్రోలిథిక్ టూల్స్) గుర్తించాడు. ఇవి చిన్నరాతి పనిముట్లు, ఇందులో కొన్ని ఒక సెంటీమీటర్ పొడవు ఉండగా మరికొన్ని అంతకంటే చిన్నవిగా ఉన్నాయని, వీటిలో బ్లేడు, బాణం మూలికి లాంటి పరికర